

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

# ఇందిరమ్మ కాలనీకి ట్యాంకర్ నీళ్లే దిక్కు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 22: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ (టెక్స్‌టైల్ పార్క్)లో తాగునీటి కటకట మొదలైంది. మిషన్ భగీరథ పైపులైన్లు పగలిపోవడంతో పదిరోజులుగా గ్రామస్తులు నీటి కోసం గోస పడుతున్నారు. మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. పంచాయతీట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని వాపోయారు. అధికార యంత్రాంగం స్పందించి మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

## 29 నుంచి బీఫార్మసీ పరీక్షలు



కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 22: శాతావాహన యూనివర్సిటీ పరిధిలో బీ ఫార్మసీ పరీక్షలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయని పరీక్షల నియంత్రణ అధికారి శ్రీరంగ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు 29నుంచి, మూడో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 30నుంచి ప్రారంభం అవుతాయని తెలిపారు.

## ఎంఎస్సీ ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 22: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఎంఎస్సీ గణితం రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండో సెమిస్టర్ రెగ్యులర్, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలు ఆన్‌లైన్ ((http://103.119.113. 107:85, www.satavahana.ac.in)) అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్‌లో చిచ్చు

## జీవన్‌రెడ్డి అనుచరుడి హత్యతో భగ్గుమన్న విభేదాలు

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వల్లే హత్య అంటూ ఎమ్మెల్సీ వర్గీయుల నిరసన
- ధర్నాలో నాలుగు గంటలపాటు కూర్చున్న ఎమ్మెల్సీ
- నా అనుచరుడిని చంపితే నన్ను చంపినట్లేనని ఆవేదన
- మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టుకు గంగారెడ్డిని ప్రతిపాదించడం వల్లే దారుణం చేశారంటూ వ్యాఖ్యలు
- జిల్లాలో పది నెలలైనా కొలిక్కిరాని నామినేటెడ్ పోస్టుల పంపిణీ
- జీవన్‌రెడ్డి ప్రతిపాదించిన ప్రతి పోస్టు పెండింగ్‌లోనే
- ఒంటరైన సీనియర్ నేత
- తీవ్ర నైరాశ్యంలో పార్టీ శ్రేణులు



మారు గంగారెడ్డి (ఫైల్)

**జగిత్యాల కాంగ్రెస్‌లో చిచ్చురగులుతున్నది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో అగ్గిరాజుకుంటున్నది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వర్గాల మధ్య కొన్ని నెలలుగా నడుస్తున్న అంతర్యుద్ధం, తాజాగా జరిగిన హత్యతో బహిర్గతమవుతున్నది. తాజాగా ఎమ్మెల్సీ అనుచరుడు, సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మారు గంగారెడ్డి మర్డర్ కావడం సంచలనం సృష్టించింది. అయితే మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టుకు గంగారెడ్డిని ప్రతిపాదించడం వల్లే దారుణం జరిగిందని, ఈ హత్యకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కారణమని ఆరోపిస్తూ జీవన్‌రెడ్డి వర్గీయులు ఆందోళన చేయడం, ధర్నాలో ఎమ్మెల్సీ స్వయంగా నాలుగు గంటలకు పైగా పాల్గొనడం పార్టీని కుదిపేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్ కావాల్సిన గంగారెడ్డిని హత్య చేయడం అంటే తనను హత్య చేయడమేనని జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేయడం కాకపుట్టిస్తుండగా, ఈ హత్య ఇరువర్గాల మధ్య విభేదాలకు మరింత ఆజ్యం పోసింది.**



జగిత్యాల పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 22, (నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని మార్కెట్ కమిటీల పాలకవర్గాల ఏర్పాటు పూర్తయింది. కానీ, ఇంత వరకు జగిత్యాల నియోజకర్గంలోని రెండు మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమించలేదు. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న జీవన్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో జగిత్యాల, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్లతోపాటు పాలకవర్గానికి కొందరు కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. జగిత్యాల మార్కెట్ కమిటీకి జాబితాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, బీసీ నేత మారు గంగారెడ్డి పేరును ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాలకవర్గాల భర్తీ నిలిచిపోయింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరగా, నియోజకవర్గంలోని రాజకీయాలన్నీ తారుమారయ్యాయి. ఎమ్మెల్సీ ప్రతిపాదించిన పేర్లను పక్కన పడేస్తూ, ఎమ్మెల్యే మరికొందరి పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీంతో చిక్కుల్లో పడిన అధికారులు ఎవరినీ ఎంపిక చేయకుండా వదిలిపెట్టారు. దీంతో కార్యకర్తలు, నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ ప్రతిపాదించిన మారు గంగారెడ్డి దారుణ హత్యకు గురి కావడం, హత్య చేసిన వ్యక్తుల వెనుక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హస్తం ఉందని జీవన్‌రెడ్డి వర్గీయులు బాహాటంగానే ఆరోపణలు చేయడం సంచలనం సృష్టించింది. తన అనుచరుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ కావాల్సిన గంగారెడ్డిని హత్య చేయడం అంటే తనను హత్య చేయడమేనని, జగిత్యాలలో కాంగ్రెస్ రాజ్యంలో కాంగ్రెస్ వాళ్లనే చంపుతున్నారని, తనకు సొంత తమ్ముడి కంటే ఎక్కువ అయిన అనుచరుడిని చంపివేశారని జీవన్‌రెడ్డి ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేయడంతో ఆయన వర్గీయులు రగిలిపోతున్నారు. అధికారం లేకున్నా, దశాబ్దకాలంపాటు పార్టీ కోసం పనిచేశామని, పోలీస్ కేసుల్లో చిక్కుకొని, జైలుకు వెళ్లి వచ్చామని గుర్తు చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సైతం గుర్తింపు వస్తుందనకుంటే నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్లు ఏ నాయకుడితో తాము పోరాటం చేశామో..? ఇప్పుడు అదే నాయకుడు పార్టీలోకి చేరి, తమకు పదవులు రాకుండా చేస్తున్నాడని తీవ్ర మనోవేదన చెందుతున్నారు.

### గ్రంథాలయ చైర్మన్ ఎంపికలోనూ జాప్యం

జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పాలకవర్గం ఎంపిక విషయంలోనూ తీవ్ర జాప్యం నెలకొంది. జిల్లాస్థాయి పోస్టు కావడంతో మూడు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పదవిని ఆశిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గంలోని బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన ఒక సీనియర్ నాయకుడికి చైర్మన్ పోస్టు కట్టబెట్టాలని ప్రభుత్వ విప్ ప్రయత్నించారు. అలాగే, కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు సైతం అదే పదవిని ఆశిస్తూ వచ్చారు. జిల్లా కేంద్రానికి చెందిన దళిత సీనియర్ కార్యకర్త పేరును ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రతిపాదించారు. అయితే, ఇది ఇష్టం లేని ఎమ్మెల్యే పార్టీలో సుదీర్ఘకాలం నుంచి కొనసాగుతున్న మరో నాయకుడి పేరును సిఫారసు చేశారు. దీంతో చైర్మన్ ఎంపికలో ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ పదవి భర్తీ విషయంలో ఎమ్మెల్యే చక్రం తిప్పి, తన రాజకీయ ప్రత్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నిర్ణయాన్ని విజయవంతంగా అడ్డుకున్నట్టు తెలుస్తున్నది. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జితో ఉన్న బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని, చొప్పదండి, ధర్మపురి ఎమ్మెల్యేలను ఒప్పించి, ఎమ్మెల్సీ ప్రతిపాదించిన దళిత వర్గానికి చెందిన నాయకుడికి కాకుండా, తన సామాజిక వర్గానికి చెందిన కోరుట్ల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడి పేరును ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ప్రభుత్వం పది పన్నెండు జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లను, పాలకవర్గాలను ప్రకటించినా, జగిత్యాలకు ప్రకటన జరగనట్టు తెలుస్తున్నది. కాగా, జగిత్యాల ఎమ్మెల్యేతో పాటు ప్రభుత్వ విప్, ఇతర ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా ఒకే పేరును ప్రతిపాదించడంతో పార్టీ అధిష్టానం సైతం అతడి నియామకానికే మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తున్నది.

### హత్యతో ఉప్పు నిప్పుగా.. ఇరువర్గాలు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గాల మధ్య నిన్నామొన్నటి వరకు విభేదాలు ఉండగా, తాజాగా జీవన్‌రెడ్డి అనుచరుడి హత్యతో పరిస్థితి ఉప్పు, నిప్పుగా మారిపోయింది. ఇప్పటి వరకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే వర్గాలకు చెందిన ఒకరు ఒకవైపు ఉంటే, మరొకరు మరోవైపు ఉంటూ వచ్చారు. కొద్ది రోజుల క్రితమే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మైనింగ్‌శాఖకు ఒక లేఖ రాశారు. మల్యాల మండల పరిధిలో అనేక అక్రమ క్రషర్లు పనిచేస్తున్నాయని, వాటి వల్ల ప్రకృతి విధ్వంసం జరుగుతున్నదని, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఈ క్రషర్లన్నీ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వర్గానికి చెందినవనే అభిప్రాయాలు సర్వత్రా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వీటిపై చర్యలు తీసుకోవాలని సీఎంకు లేఖరాయడం సంచలనం సృష్టించింది. ఇక ఇటీవల జగిత్యాల పోలీస్ స్టేషన్ సమీపంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన కార్యకర్తలు దసరా శుభాకాంక్షలు చెబుతూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వీటిని అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింపివేశారు. ఎమ్మెల్సీ వర్గీయులే చింపివేశారని ఎమ్మెల్యే వర్గీయులు ఆరోపించగా, పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఇవన్నీ సద్దుమణగక ముందే చోటుచేసుకున్న హత్య జగిత్యాల కాంగ్రెస్‌లో సంచలనం సృష్టించింది. జగిత్యాల కాంగ్రెస్‌లో జరుగుతున్న సంఘటనలతో కార్యకర్తలు, నాయకులు తీవ్ర మానసిక క్షోభకు లోనవుతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు ఎటు వెళ్తే ఏమవుతుందో..? అని భయపడుతున్నారు. కాగా, ఇలాంటి పరిస్థితులు పార్టీకి మంచివి కావని, పార్టీ అధిష్టానం ఏదో ఒక నిర్ణయం తీసుకొని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకత్వానికి భరోసా కలిగించాలని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.

## ఇంక కాంగ్రెస్‌లో ఉండలేను

- మీకో దండం.. మీ పార్టీకో దండం
- పార్టీ ఫిరాయింపుల వల్లే హత్యలు
- నలభై ఏండ్ల సేవకు మంచి బహుమతి ఇచ్చారు
- అధికారం కాదు.. నైతిక విలువలే ముఖ్యం
- రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉందా?
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 22, (నమస్తే తెలంగాణ) : 'నా వాళ్లను చంపుతున్నారు. నన్ను, కార్యకర్తలను అవమానిస్తున్నారు. ఇంకా కాంగ్రెస్‌లో కొనసాగలేను. మా బతుకులు మమ్మల్ని బతుకనివ్వండి. పార్టీకి నలభై ఏండ్లుగా సేవ చేస్తున్నాను. అందుకు మంచి బహుమతి ఇచ్చారు. మీకో దండం.. మీ పార్టీకో దండం' అంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాజ్యంలోనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చచ్చిపోతున్నారని, పార్టీనే చంపుతున్నదని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పార్టీ ఫిరాయింపులకు పాల్పడడం వల్లే గంగారెడ్డి లాంటి కార్యకర్తల హత్యలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, అసలు ఇక్కడ లా అండ్ ఆర్డర్ ఉన్నదా? అని ప్రశ్నించారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, ఎమ్మెల్సీ ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి మంగళవారం ఉదయం హత్యకు గురికాగా, విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చలించిపోయారు. జగిత్యాల జిల్లా ప్రధాన దవాఖానకు చేరుకున్నారు. తన ప్రధాన అనుచరుడి మృతదేహాన్ని చూసి కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయ కక్షతోనే హత్య జరిగిందని భావించి పార్టీ శ్రేణులతో కలిసి పాతబస్టాండ్ వద్ద 563 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. సుమారు నాలుగు గంటల పాటు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. గంగారెడ్డి తనకు తమ్ముడి లాంటి వాడని, 30 ఏండ్లుగా తన వెంట ఉన్న వ్యక్తి ఇలా దారుణంగా హత్య గురి కావడం బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గంగారెడ్డిని చంపుతానని బత్తిని సంతోష్ అనే వ్యక్తి గతంలో బెదిరించాడని, ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటని పోలీసులను ప్రశ్నించారు. పోలీసుల నిర్లక్ష్యం మూలంగానే హత్య జరిగిందని, బాధ్యత వహించాలంటూ డిమాండ్ చేశారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సముదాయిస్తూ, చర్యలు తీసుకుంటామని చెప్పగా, మీ ఎస్ఐ కాల్ రికార్డులు తీయాలని, అప్పడే హంతకుడికి, ఎస్ఐకి సంబంధం ఉందా? లేదా? తెలుస్తుదన్నారు. కాగా, విప్ లక్ష్మణ్‌కుమార్ పన్నెండు గంటల ప్రాంతంలో ధర్నా వద్దకు చేరుకోగా, నాయకులు ఘొరావ్ చేశారు. కార్యకర్త హత్యకు గురయ్యాడని ఉదయం 7 గంటలకు సమాచారం ఇస్తే.. ఇప్పుడా వచ్చేది? అంటూ ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎస్పీ అశోక్‌కుమార్ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. విప్ లక్ష్మణ్‌కుమార్ కలుగజేసుకునేందుకు యత్నించగా, 'బాబు.. నీకో దండం.. నీ పార్టీకో దండం.. మమల్ని ఇలా బతుకనివ్వండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇవ్వడంతో ఎమ్మెల్సీ ధర్నాను విరమించి దవాఖానకు వెళ్లారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు, పార్టీ విధానాలపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు అధికారాన్ని ఆశించడం సహజమేనని, అయితే అధికారం కంటే నైతిక విలువలే ముఖ్యమన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించడంతో పది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, శ్రేణులు నైరాశ్యానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను మూడు నెలలుగా మానసికంగా తీవ్రంగా కుంగిపోయాన్నారు. నలభై ఏండ్లు పార్టీలో పనిచేసిన తనలాంటి వారికి పార్టీలో స్థానం ఎక్కడ ఉంది? అన్నది అర్థం కావడం లేదన్నారు. గంగారెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్న సమయంలో అక్కడే ఉన్న ఎమ్మెల్సీకి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సమయంలో జీవన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహంతో మాట్లాడడం కనిపించింది. 'నా వాళ్లను చంపుతున్నారు. నన్ను, కార్యకర్తలను అవమానిస్తున్నారు. ఇంకా కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేను' అంటూ స్పష్టం చేశారు. కాగా, పీసీసీ అధ్యక్షుడు ఫోన్‌లో మాట్లాడుతుండగానే, ఎమ్మెల్సీ ఆవేశంతో ఫోన్ కట్ చేసి, విసిరిపారేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.



కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వ్యవసాయ క్షేత్రంలో జర్మనీ బృందం, శాస్త్రవేత్తలు

# సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- టెక్నాలజీతో పంటలను సాగు చేయాలి
- జర్మనీ ఫ్రాన్ హోఫర్ హెచ్‌హెచ్ఐ డాక్టర్ సెబాస్టియన్
- మామిడిపల్లి సొసైటీలో జర్మనీ బృందం, శాస్త్రవేత్తల సందర్శన
- సాగుపై రైతులకు అవగాహన, అధ్యయనం

కోనరావుపేట, అక్టోబర్ 22 : వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా పంట మార్పిడి చేస్తూ, సాంకేతికతను వినియోగించి వ్యవసాయం చేయాలని జర్మనీ ఫ్రాన్ హోఫర్ హెచ్‌హెచ్ఐ డాక్టర్ సెబాస్టియన్ సూచించారు. కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి గ్రామాన్ని జర్మనీ బృందం, శాస్త్రవేత్తలతో కలిసి ఆయన సందర్శించారు. గ్రామంలో ఆకారాట్ ప్రాజెక్టు కింద ఆధునిక సాంకేతికతో వ్యవసాయం చేస్తున్న రైతుల పంటచేలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలోని పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆకారాట్ ప్రాజెక్టు కింద పంట సాగు చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పద్ధతులు పాటిస్తున్నారు? దిగుబడి ఎలా ఉన్నది? ఏవైనా సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నారా? అంటూ రైతులను ప్రశ్నించి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసేందుకు స్మార్ట్‌ఫోన్ ఆప్‌ల ద్వారా వివరించేందుకు నూతన మార్గాలను అన్వేషిస్తామని వెల్లడించారు. తద్వారా సాగులో రైతులు ఉత్పత్తిని పెంచేందుకు, వాతావరణ మార్పులను ప్రతిఘటించేందుకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో వ్యవసాయాన్ని మరింత వృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామన్నారు. అలాగే, ఇక్కడి రైతులు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న తీరును అభినందించారు. రాబోయే రోజుల్లో అధునాతన పద్ధతులతో వ్యవసాయం చేసి, దిగుబడి పెంచేలా తగు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఇక్కడ డాక్టర్ రఘు చలిగంటి, జాన్‌మిస్టర్, జర్మనీ ఫెడరల్ మంత్రిత్వశాఖ మిస్టర్ మార్టిన్, అగ్రిహబ్ విజయ్, సేవ్స్ నుంచి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కృష్ణ, సొసైటీ చైర్మన్లు ముత్యాల కిషన్‌రెడ్డి, కౌడుక రమేశ్, రైతులు పాల్గొన్నారు.



కథలాపూర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏఈవోలు (ఫైల్)

# 18 మంది ఏఈవోల సస్పెన్షన్లు

- ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ శాఖ
- డెత్ స్క్రీన్ రికార్డు చేయలేదనే సాకు
- సర్కారు కక్ష సాధింపు చర్యలు!
- షోకాజ్ నోటీసులు ఇవ్వకుండానే సస్పెండ్
- డిజిటల్ క్రాప్ సర్వే చేయడం లేదన్న కోపంతోనే అంటున్న ఉద్యోగ సంఘాలు
- మూకుమ్మడి సెలవులు పెట్టే దిశగా ఏఈవోల అడుగులు

**వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో)పై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) చేయడం లేదన్న కోపంతో గతంలోనే షోకాజ్ నోటీసులతో బెదిరింపులకు పాల్పడిన సర్కారు, ఇప్పుడు ఏకంగా సస్పెన్షన్ వేటు వేసింది. డీసీఎస్‌ను చూపి చర్యలు తీసుకుంటే బద్నాం అవుతామని భావించి, డెత్ స్క్రీన్ రికార్డు చేయడంలో నిర్లక్ష్యం చేశారనే సాకును చూపి ఉమ్మడి జిల్లాలో 18మంది ఏఈవోలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజంగా తప్పు జరిగి ఉంటే ముందుగా షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ కోరాల్సి ఉన్నా.. అవేవి లేకుండానే ఆగమేఘాల మీద సస్పెన్షన్ చేయడంపై ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. సర్కారు తీరును నిరసిస్తూ ఏఈవోలు మూకుమ్మడి సెలవులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.**

కరీంనగర్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) చేయడం తమ వల్ల కాదని రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) ఇప్పటికే తేల్చిచెప్పారు. రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, పంట నష్టం సర్వే, పంట కోత ప్రయోగాలు, ధాన్యం సేకరణ, గ్రామాల వారీగా ప్రణాళిక, రుణమాఫీ కుటుంబ సర్వేల వంటి తదితర 49 రకాల విధులు నిర్వర్తిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న విధులతోనే మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్టుగా కేంద్ర నిబంధనల ప్రకారం డీసీఎస్ చేయడం తమ వల్ల కాదని వినతులు చేస్తూ వస్తున్నారు. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న ఏఈవోల్లో 65 శాతం మంది మహిళలే ఉన్నారని, ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఒత్తిడి తేవడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. అయినా ప్రభుత్వం ఒత్తిడి తేవడంతో డిజిటల్ క్రాప్ సర్వేను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో.. గణాంకాలతో సహా సర్కారుకు ఆ సంఘం వివరించింది. ఒక్కో క్లస్టర్ పరిధిలో 15 నుంచి 20 వేల ఫామ్స్ ఉంటాయని, పెద్ద క్లస్టర్‌లో అయితే 30వేలకు పైగా ఫామ్స్ ఉన్నాయని, క్రాప్ సర్వే కింద 15వేల ఫామ్స్ ఉన్న క్లస్టర్‌లో ఒక్కో ఫామ్స్‌కు రెండు సార్లు వెళ్లినా ఒక పంట కాలంలో ఒక ఏఈవో 30వేల సార్లు వెళ్లాల్సి ఉంటుందని, ఇది సాధ్యం అయ్యే పని కాదని, అందుకే ఇతర రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలోనూ సర్వే చేయాలని కోరింది. అయినా వినకుండా అందుకు సంబంధించిన యాప్‌ను కచ్చితంగా డౌన్‌లోడ్ చేసుకొని.. పని మొదలు పెట్టాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నది. తలకు మించిన భారాన్ని తాము మోయలేమంటూ ఏఈవోలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోవడంతో బెదిరింపులకు సైతం దిగింది. ఆ మేరకు ఇటీవల వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి 59 మంది ఏఈవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే పెద్దపల్లి జిల్లాలో 40 మంది ఏఈవోలు యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేదని, క్రాప్ సర్వే విధులను నిర్వర్తించడం లేదని పేర్కొంటూ గత నెల 27, 28 తేదీల్లో గైర్హాజర్ (ఆబ్సెంట్) వేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

### 18 మంది సస్పెన్షన్


ప్రభుత్వ బెదిరింపులకు ఏఈవోలు దిగి రాకపోవడంతో సర్కారు సస్పెన్షన్ల ప్రక్రియకు పూనుకున్నది. అందులో భాగంగానే మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 165 మంది ఏఈవోలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఉమ్మడి జిల్లా నుంచి 18 మందిపై వేటు చేసింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలో ఐదుగురు చొప్పున ఏఈవోలు సస్పెన్షన్ కాగా, పెద్దపల్లి జిల్లాలో ముగ్గురు అయ్యారు. డిజిటల్ క్రాప్ సర్వే చేయడం లేదనే కారణం చూపి సస్పెండ్ చేయడం సాధ్యం కాదని భావించిన సర్కారు, కొత్త కారణాలను వెతుక్కుందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం సస్పెండ్ చేసిన వారందరికీ దాదాపు ఒకే కారణం చూపారు. రైతుబీమాకు సంబంధించి మరణాల విషయాన్ని ఆలస్యంగా నమోదు (డెత్‌స్క్రీన్ రికార్డు) చేశారని పేర్కొంటూ వారిని సస్పెన్షన్ చేశారు. నిజానికి ఒక రైతు చనిపోయిన వారం రోజుల్లో వారి కుటుంబసభ్యుల నుంచి సమాచారం వస్తే.. సదరు సమాచారాన్ని ఏఈవోలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఇచ్చే డెత్ సర్టిఫికెట్, ఆధార్ వంటివి అప్‌లోడ్ చేసి పరిహారం అందేలా చూస్తారు. ప్రస్తుతం సస్పెండ్ అయినా ఏఈవోల పరిధిలో ఏ ఒక్క బాధితుడికి అన్యాయం జరగలేదని తెలుస్తున్నది. నిబంధనల ప్రకారం కొంత ఆలస్యం జరిగినా.. బాధిత కుటుంబాలకు ₹5 లక్షల పరిహారం అందిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అయితే డిజిటల్ క్రాప్ సర్వేకు ససేమిరా అంటున్నారని ఏదో ఒకటి సాకుగా చూపి చర్యలు తీసుకుంటే.. అందరూ దారికి వస్తారన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించిందన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి ఇటువంటి తప్పులకు సస్పెన్షన్ చేసే ముందు సంబంధిత ఉద్యోగికి ముందుగా షోకాజ్ నోటీస్ ఇవ్వాలి. వారి నుంచి వివరణ తీసుకోవాలి. ఉద్యోగి ఇచ్చిన వివరణ సరిగా లేనప్పుడు సస్పెన్షన్ చేయాలి. కానీ, ఇక్కడ ఈ నిబంధనలకు ప్రభుత్వం మంగళం పలికింది. హుటాహుటినా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ చర్యపై అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతుండగా.. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఏఈవోలు మూకుమ్మడి సెలవుల్లో వెళ్లేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. అదే జరిగితే ప్రస్తుత ధాన్యం కొనుగోళ్ల పై భారీ ప్రభావం పడే ప్రమాదమున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం ఏఈవోల విషయంపై ఆలోచన చేయాలన్న డిమాండ్‌ను ఉద్యోగ సంఘాలు వినిపిస్తున్నాయి.

### సస్పెన్షన్లు వీరికే..

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 18మంది ఏఈవోలపై వేటు వేయగా, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో మాత్రం పేర్లను ప్రకటించారు. జగిత్యాల జిల్లాలో మేడిపల్లి మండలం వెంకట్రావుపేట్ క్లస్టర్ ఏఈవో ఐలవేని నరేందర్, కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ జీ గ్రీష్మ, మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ బీ మనోజ్ఞ, కోరుట్ల పీ నరేశ్, ధర్మపురి మండలం తిమ్మాపూర్ ఎన్ సమంతను సస్పెండ్ చేశారు. అలాగే సిరిసిల్ల జిల్లాలో వేములవాడ రూరల్ ఏఈవో మహ్మద్ ఇనామిల్, శాత్రాజులపల్లె దుంద్రపల్లి రాజు, ఇల్లంతకుంట ఏఈవోలు ఆవునూరి గంగ, దాచారం వంగల అర్చన, ముస్తాబాద్ ఎదునూరి కీర్తనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# గంగులకు మాతృ వియోగం

- అనారోగ్యంతో తల్లి నర్సమ్మ మృతి
- నేడు కరీంనగర్‌లో అంత్యక్రియలు



గంగుల నర్సమ్మ (ఫైల్)

కార్పొరేషన్, అక్టోబర్ 22: మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల నర్సమ్మ (85) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని నివాసంలో మంగళవారం ఉదయం మృతి చెందారు. కాగా, ఆమె భౌతికకాయానికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ శ్రేణులు నివాళులర్పించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ప్రస్తుతం గంగుల కమలాకర్ విదేశాల్లో ఉండడంతో బుధవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక మార్కండేయనగర్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, గంగుల కమలాకర్ మాతృమూర్తి మృతిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు వేర్వేరు ప్రకటనల్లో ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.